క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో యాగశాల ప్రతిష్ట



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన యాగశాల ప్రతిష్ట కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో యాగశాల దాత అనకాపల్లికి చెందిన యర్నాగుల మోహన్‌రావు, అనూరాధ దంపతులతో కుంకుమ పూజలు, హోమాలు ప్రారంభించారు. దాత మోహన్‌రావు మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులైన అప్పలస్వామి, కనరత్నం జ్ఞాపకార్థం రూ.8లక్షతో యాగశాల నిర్మాణం చేపట్టామన్నారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ వాసుదేవరావు, గుమస్తా సుదర్శనరావు, ఆలయ సిబ్బంది, కుంకుమ పూజల్లో పాతపట్నం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ దివాకర్

ఆమదాలవలస: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించేందుకు ప్రజలు సహకరించాలని ఆమదాలవలస సీఐ దివాకర్ కోరారు. మున్సిపాలిటీ పరిధి రెండో వార్డు కృష్ణాపురంలో గురువారం సాయంత్రం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు ఇవ్వకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షణికావేశంలో కొట్లాటకు దిగి కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. ఎస్ఐ కె.వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



సరుబుజ్జిలి: అవతరాబాద్‌లో వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు కోరారు. మండలంలోని సరుబుజ్జిలి, అవతరాబాద్ గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై గురువారం అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేయించారు. ఆర్ఐ బాబూరావు, వీఆర్వోలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని వెలుగు సీసీలు జ్యోతి, చంద్రరావు అన్నారు. కొత్తూరులో గురువారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కురిగాంలో కార్డన్ సెర్చ్



కేంద్ర బలగాలకు సూచనలిస్తున్న సీఐ వేణుగోపాలరావు

కొత్తూరు: మండలంలోని ఆంధ్రా – ఒడిశా సరిహద్దు గ్రామం కురిగాంలో గురువారం కేంద్ర బలగాలతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సీఐ వేగణుగోపాలరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి పత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు కొత్తూరు ఎస్ఐ అహమ్మద్ తెలిపారు. వాహనాలకు సంబంధించిన అన్ని రకాల అనుమతి పత్రాలను వెంట తీసుకురావాలన్నారు. హిరమండలం ఎస్ఐ నారాయణ స్వామి పాల్గొన్నారు.

ఫ్లాగ్ మార్చ్



చీపురుపల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: ప్రతిఒక్కరూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పాతపట్నం సీఐ నల్లి సాయి అన్నారు. మండలంలోని చీపురుపల్లి, వసుంధర గ్రామాల్లో గురువారం కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు ఎటువంటి భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికావొద్దని, పటిష్ట భద్రత కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిత్యం పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఎస్సై రాజేష్, పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.



సారవకోట: సచివాలయ ఆవరణలో పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

చంద్రబాబూ నీకిది న్యాయమా?



నా భార్య, కుమారుడు చనిపోయారు. నాకు ఎవ్వరూ లేరు. నెలనెలా నాకు ఇంటి వద్దకే గ్రామ వలంటీర్ తీసుకొచ్చి ఇచ్చేది. ఇప్పుడు ఎక్కడికో రమ్మంటున్నారు. నేను నడవలేను, కాపలాకాయలేను. నాకు పెన్షన్ ఇంటి వద్దకే వచ్చి ఇచ్చే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కావాలి. నాయనా చంద్రబాబు నీకిది న్యాయమా? మా లాంటి వృద్ధుల ఉసురు పోసుకోకయ్యా..

– గరికి మల్లేసు, వృద్ధుడు, జీపురుపల్లి గ్రామం, మెళియాపుట్టి

ఇబ్బంది పెట్టడం తగదు..



మాలాంటి వారికి ఎండలో ఇలా పింఛన్ కోసం తిప్పింది చంద్రబాబు అని తెలిసింది. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చేది. కాళ్ల నొప్పులు ఉన్న నాకు ఇలా తిప్పడం చాలా ఇబ్బంది కలిగింది. ఇంకొకరు సహాయంతో వచ్చాను. ఇలాంటి బాధలు ఎవరికీ రాకూడదు.

– షేక్ అమంబి, వృద్ధురాలు, కొత్త కంద్రపేట, 18వ వార్డు, ఆమదాలవలస

ప్రాణం పోతుంది..



పింఛన్ కోసం ఇంటి నుంచి కిలో మీటరు దూరంలో ఉన్న గ్రామ సచివాలయం వద్దకు వెళ్లే సరికి ప్రాణం పోతుంది. మంటుటెండలో నడుచుకొని వెళ్లాను. ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురైయ్యాను. గతంలో వలంటీర్ ఇంటికి తీసుకువచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు.

– కెసిల్లి అసిరమ్మ, పింఛన్‌దారు, కొత్తూరు

పింఛన్.. టెన్షన్



పాతపట్నం: అంతరాబ సచివాలయానికి పింఛన్ కోసం వచ్చిన దివ్యాంగురాలు

టీడీపీ నాయకులు చేసిన కుట్రలతో పింఛన్‌దారులు పింఛన్ డబ్బుల కోసం రెండో రోజు అవస్థలు పడ్డారు. గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ కోసం గంటల తరబడి వేచి ఉన్నారు. ఐదేళ్లపాటు వలంటీర్లు నేరుగా ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారని, ఇప్పుడు టీడీపీ నాయకులు చేసి కుట్రలకు తామంతా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పింఛన్‌దారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: పింఛన్ కోసం మోనింగివారి వీధి సచివాలయం వద్ద ఉన్న లబ్ధిదారులు



కొత్తూరు: సచివాలయం -1లో పింఛన్ కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురం సచివాలయానికి 2 కిలో మీటర్ల దూరం నుంచి వచ్చిన వృద్ధుడు



మెళియాపుట్టి: పెద్దపద్మాపురం సచివాలయం వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

- ఎన్నికల ప్రచారంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి



ఆమదాలవలస రూరల్: ఇసుకలపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



పోలాకి: అంపలాంలో ప్రచారం నిర్వహిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలంలో నారిపేట, ఇసుకలపేట, దిబ్బలపేట, తొగరాం గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నరసన్నపేట మండలంలోని కోమర్తి, దేవాది పంచాయతీల్లో నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని నర్సింహనగర్, నర్సింహనరగ్–1లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. మెళియాపుట్టి మండలంలోని పరశురాంపురం గ్రామ సచివాలయం పరిధిలోని తూముకొండ, పెద్దమడి, నందవ,తోవూరు తదితర గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గిరిజన మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా ఆహ్వానించారు. పోలాకి మండలం అంపలాం పంచాయతీ పరిధిలోని రాజారాంపురం, అంపలాం, నందిగాం, రేవు అంపలాం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొత్తూరు మండల కేంద్రంలోని అల్లు, బ్రాహ్మణ, మూలి, దేవాంగుల, మేదర, ఎస్సీ వీధుల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు రెడ్డి ఓం శ్రీకృష్ణ ప్రచారం నిర్వహించారు. హిరమండలం మండలంలోని గొట్టా పంచాయతీ పరిధి గొట్ట, లక్ష్మీపురం గ్రామాల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు రెడ్డి శ్రావణ్ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: నందవలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొత్తూరు: అల్లు వీధిలో ప్రచారం చేస్తున్న రెడ్డి ఓం శ్రీకృష్ణ



హిరమండలం: గొట్టాలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న రెడ్డి శ్రావణ్



నరసన్నపేట: కోమర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: నర్సింహనగర్‌లో యువకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

గ్రామ వలంటీర్ల రాజీనామా



సరుబుజ్జిలి: విధులకు రాజీమానా చేస్తున్న తోటవాడ సచివాలయం వలంటీర్లు



జలుమూరు: రాజీనామా లేఖలతో వలంటీర్లు

సరుబుజ్జిలి: బూర్జ మండలంలోని తోటవాడ, పెద్దపేట గ్రామ సచివాలయాలకు చెందిన 30 మంది గ్రామ వలంటీర్లు తమ విధులకు గురువారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఆయా సచివాలయం కార్యదర్శులు బి.రామకృష్ణ, కల్యాణ్‌బాబుకు అందించారు.

జలుమూరు: స్థానిక సచివాలయం పరిధిలోని 15 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలను ప్రజలకు వివరిస్తామన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొర్రంపేట గ్రామ సచివాలయం పరిధిలో బొర్రంపేట గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. బొర్రంపేట గ్రామంలో పనిచేస్తున్న పూజారి ఈశ్వరమ్మ, మామిడి రమేష్, వీరఘట్టపు రంగమ్మ, కుప్పిలి వెంకటేష్, గొల్లపల్లి దివ్య, పేడాడ తిరుపతిరావు, సాకేటి ధనలక్ష్మి తమ రాజీనామా పత్రాలను గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అందజేశారు.

ఆమదాలవలస రూరల్: మండలంలో కలివరం సచివాలయం పరిధిలో గల 12 మంది, వంజంగి గ్రామ సచివాలయాల పరిధిలో 19 మంది గ్రామ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను గ్రామ సచివాలయ కార్యదర్శులకు అందజేశారు.

పాతపట్నం: పాతపట్నం-1 సచివాలయానికి చెందిన 19 మంది, పాతపట్నం-2 సచివాలయానికి చెందిన 21 మంది, పాతపట్నం-3 సచివాలయానికి చెందిన 24 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కె.రామకృష్ణరాజుకు అందజేశారు.

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలస సచివాలయం-1, సచివాలయం -2 పరిధిలో 49 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసారు. సచివాలయ అడ్మిన్‌లకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లు



ఆమదాలవలస రూరల్: కలివరం సచివాలయంలో రాజీనామా లేఖలను అందజేస్తున్న గ్రామ వలంటీర్లు



పాతపట్నం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు



ఆమదాలవలస: మెట్టక్కివలసలో రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు

తాగునీటి ఇబ్బందులు ఉండకూడదు



మాట్లాడుతున్న ఎంపీపీ గోపి

జలుమూరు: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రానున్న ఖరీఫ్ కాలానికి రైతులకు కావాల్సిన విత్తనాలు పూర్తిస్థాయిలో అందిస్తామని ఏఓ కె.సురేస్ తెలిపారు. తాగునీటిపై అల్లాడ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు మాట్లాడుతూ గ్రామాల్లో పలు ఇబ్బందులు ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. ఏఈ చైతన్య మాట్లాడుతూ శ్రీముఖలింగం రక్షిత మంచినీటి పథకం మోటారు పాడవ్వడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని, గుత్తేదారునితో వెంటనే మరమ్మతులు చేయించి పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తామన్నారు. అల్లాడ పంచాయతీ పరిధి రామదాసుపేటలో ప్రభుత్వ పాఠశాల, చెరువు గట్టు ఆక్రమణలకు గురయ్యాయని, అధికార్లుకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని శ్యామలరావు ప్రశ్నించారు. తహసీల్దార్ సీహెచ్ నాగమ్మ మాట్లాడుతూ ఆక్రమణలు తొలగిస్తామని వివరించారు. గుగ్గిలిలో ఉపాధి పనులు కొలతలు లేకుండా చేస్తున్నారని సర్పంచ్ కూర్మారావు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు పలు గ్రామాల్లో ఉన్నందున సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ దామోదరరావు, పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మందలమ్మకు ప్రత్యేక పూజలు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో గల మందలమ్మ అమ్మవారి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆరవెల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు ఘటాలతో అమ్మవారికి ముర్రాటలు చెల్లించారు.

అనంతరం అన్నప్రసాదవితరణ చేశారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కిల్లి రామ్మోహనరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ముమ్మరంగా తనిఖీలు



రైల్వే స్టేషన్ ఆవరణలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ ఆవరణలో ఆర్పీఎఫ్, లోకల్ పోలీస్‌ల ఆధ్వర్యంలో గురువారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రయాణీకుల బ్యాగులు, అనుమానిత వ్యక్తులకు సంబంధించిన వస్తువులను పరిశీలించారు. ఆర్పీఎఫ్ సీఐ నాయక్, ఆమదాలవలస సీఐ దివాకర్, ఎస్ఐ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి కనిపించడం లేదా కూన?



మాట్లాడుతున్న పప్పల రమేష్‌కుమార్

పొందూరు: స్పీకర్ తమ్మినేని సీతారాంకు ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకే టీడీపీ మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్పీకర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఏం సాధించారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం కూన రవికుమార్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ గెలుపును గుర్తించిన కూన రవికుమార్ ఓటమి భయంతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, నాడు-నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధే స్పీకర్ పనితీరుకు నిదర్శనమన్నారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, హార్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటు చేసిన ఘనత స్పీకర్‌కే దక్కిందన్నారు. బూర్జలోని భూమిని కూనవారి పూలతోటకు లీజుకు తీసుకుని సొంత అవసరాలకు వాడుకోవాలని చూశారని, ఇసుక మాఫియాను నడిపించారని అటువంటి మీరు స్పీకర్‌పై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ హయాంలో తాడివలస రెల్లిగెడ్డలో నిర్మించిన చిన్న డ్యామ్ మూడు నెలలకే కూలిపోయిందని, దానిలో మీ అవినీతి, అక్రమాలు బయటపడ్డాయని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో స్పీకర్ గెలుపు ఖాయమన్నారు.